ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 22 జూలై 2025

బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితిసింగ్



ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

● ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూలై 21(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు వచ్చే అర్జీదారుల సమస్యలను తక్షణమే అధికారులు పరిష్కరించాలని, కార్యాలయాల చుట్టూ తిప్పొద్దని ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పీజీఆర్ఎస్) జరిగింది. జిల్లా నలుమూలల నుంచి బాధితులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కాశినాయన మండలం, వడ్డమాను గ్రామ నివాసి చంద్రశేఖర్‌రెడ్డి వ్యవసాయ భూమి ఇతరులకు కౌలుకు ఇస్తే తమ భూములను తప్పుడు పాస్ పుస్తకాలతో ఆన్‌లైన్ చేసుకున్నారని కోరారు. అదేవిధంగా నగరంలోని మాసాపేటకు చెందిన అమ్మాజాన్ ఫిర్యాదు చేస్తూ తన తల్లి 35 సంవత్సరాల పాటు ఐసీడీఎస్ శాఖలో అంగన్వాడీ వర్కర్‌గా పనిచేసి ఇటీవల మరణించిందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పించాలని అర్జీ ఇచ్చారు. ఉక్కాయ పల్లికి చెందిన షమీర్‌బాష ఫిర్యాదు చేస్తూ ఉక్కాయపల్లి గ్రామంలో 0.29 సెంట్ల పట్టా భూమి తన పేరుతో ఉందని, భూమిని ఆనుకొని కేసీ కాలువ పోతున్నందున తన భూమికి సంబంధించిన పూర్తి స్థాయి హద్దులు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా పలువురు పలు సమస్యలపై వినతి అందించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూమి సారవంతం : జేసీ

పచ్చి రొట్ట ఎరువులతో భూమి సారవంతం అవుతోందని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులతో మట్టిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. జీవన ఎరువులు వినియోగిస్తే 10 శాతం ఎరువులు ఆదా చేయవచ్చని, నేలలో తగినంత తేమ ఉన్నప్పుడే జీవన ఎరువులు వాడటం మంచిదన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పాల్గొన్నారు.

చట్టపరిధిలో న్యాయం చేయండి : ఎస్పీ



సమస్య వింటున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులకు ఫోను చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. కాగా వివిధ సమస్యలపైన 163 అర్జీలు వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాశ్‌బాబు, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం తదితరులు పాల్గొన్నారు.


వీడని బాలిక హత్య మిస్టరీ !

● పక్కా ఆధారాల కోసం పోలీసుల అన్వేషణ

జమ్మలమడుగు, జూలై 21(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఈ నెల 14న జరిగిన బాలిక హత్య కేసు మిస్టరీ ఇంకనూ వీడలేదు. గత వారం రోజులుగా పోలీసు అధికారులు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసుకుని గాలిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఉదయం నుంచి గండికోట ప్రాంతంలో మృతి చెందిన బాలిక కుటుంబ సభ్యులను, అనుమానితులను ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో విచారణ చేసినట్లు తెలుస్తోంది. అలాగే గండికోటలో ఉన్నవారి సెల్‌ఫోన్లను, అక్కడికి సందర్శనకు వచ్చిన వారి సెల్‌ఫోన్ల ద్వారా మాట్లాడిన వారిని స్టేషన్‌కు పిలిపించి విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. దాదాపు 60 నుంచి 75 సెల్‌ఫోన్లకు సంబంధించిన వారిని విచారించినట్లు తెలుస్తోంది. జమ్మలమడుగు, గండికోట, ప్రొద్దుటూరు, హైదరాబాదు, తదితర ప్రాంతాల్లో ఉన్నవారిని సైతం పిలిపించినట్లు వినికిడి. ఇదిలా ఉండగా రాత్రి గండికోటలో రిసార్ట్‌లకు సంబంధించిన యజమానులు తదితరులను జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు అక్కడే సమావేశం ఏర్పాటు చేసి పలు జాగ్రత్తలు తెలియజేసినట్లు లాడ్జీల యజమానులు తెలిపారు. ఇక నుంచి గండికోటకు ఎవరు వచ్చి రూములు అడిగినా ప్రతిఒక్కరి పేరు, పూర్తి చిరునామా, ఆధార్‌కార్డు తీసుకోవాలని, ఒకవేళ ఎవరైనా మైనర్లుగా అనుమానం వుంటే అలాంటి వారికి రూములు ఇవ్వొద్దని హెచ్చరించారు. ఏదేమైనా బాలిక హత్య కేసులో నిందితులు ఎవరనేది త్వరలో తేలనుంది.

రోడ్లనూ వదల్లేదు..

● బద్వేలులో వైసీపీ నేతల బరితెగింపు
● ఎన్జీవో ప్లాట్లు ఆక్రమణ
● ఫోర్జరీ పత్రాలతో కబ్జా



బద్వేలు ఎన్జీవో లేఅవుట్‌లో వెలసిన భారీ భవంతులు

(కడప-ఆంధ్రజ్యోతి): ఈ ఊరు మనదిరో.. ఈ నేల మనదిరో.. అనే పాట గుర్తుందా. సినీనటుడు ఆర్.నారాయణమూర్తి నటించిన ఎర్రసైన్యం సినిమాలోనిది. బద్వేలులోని కొందరు వైసీపీ నేతలు కూడా ఆ సాంగ్‌ను ఆదర్శంగా తీసుకున్నట్లున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. ఇది నాదేనని ఆక్రమించేయడం, గునాదులు వేసుకోవడం.. ఒకవేళ గునాదులు ముందే ఉంటే వాటిని కూలగొట్టేసి ఆక్రమించేసుకోవడం పరిపాటైంది. ఇదెలాగంటే పూర్వం ఊరెళితే దొంగలకు భయపడి తమ ఇల్లు చూస్తూ ఉండమని ఇరుగు పొరుగుకు చెప్పి వెళ్లేవారు. అదే పరిస్థితి ఇప్పుడు బద్వేలులో వచ్చింది. ఎందుకంటే వైసీపీ ముఠాలు ఎక్కడ భూములు కబ్జా చేస్తారోనని వణికిపోతున్నారు. బద్వేలులో జరిగిన భూకబ్జాలపై సిట్ ఏర్పాటు చేస్తామని పాదయాత్ర సందర్భంగా మంత్రి నారాలోకేశ్ చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలోనే నకిలీ పట్టాలతో ఫోర్జరీ సంతకాలతో భూమి కొట్టేస్తుండడంతో కేసు నమోదైంది. జెట్ స్పీడ్‌లో ఆ కేసు అటకెక్కిపోయింది.

శివుడు ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదనే నానుడి ఉంది. బద్వేలులో భూకబ్జాలు కూడా రెవెన్యూ అధికారుల సహకారంతోనే చెలరేగిపోయిందని అంటారు. భూకబ్జాలపై కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ కొరడా ఝులిపిస్తున్నారు. బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ భూఆక్రమణలపై కబ్జాదారులకు 70 ఎంఎంలో సినిమా చూపిస్తున్నారు. ఇప్పటికే కలసపాడు, కాశినాయన, బి.కోడూరులో కోట్లాది రూపాయలు విలువ చేసే అనేక ప్రభుత్వ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో బద్వేలు ఆర్డీవో ప్రభుత్వ భూములు తిరిగి స్వాధీనం చేసుకోవడంలో టాప్‌లో వున్నారు. అయితే బద్వేలు మున్సిపాలిటీలో జరిగిన భూకబ్జాలపై తగిన పురోగతి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా బద్వేలులో సుమారు వందకోట్లు జరిగిన భూఆక్రమణలకు సంబంధించి ఇంకా కొలిక్కి రాకపోవడం గమనార్హం.

ఎన్జీవో కాలనీ @ వంద కోట్లు

బద్వేలు పట్టణంలో తొలిసారిగా 1978లో ఎన్జీవోలకు ప్లాట్లు కేటాయించారు. ఇదంతా గోపవరం రెవెన్యూ పరిధిలో ఉంటుంది. ఉద్యోగుల కోసం 8 సెంట్లు, 5 సెంట్ల చొప్పున ప్లాట్ల కేటాయించారు. అప్పటి ఉమ్మడి ఏపీలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇక్కడ ప్లాట్లు పొందారు. 8 సెంట్లు ప్లాట్లు 485, 5 సెంట్ల ప్లాట్లు 360 లేఅవుట్ వేసి కేటాయించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు ఇక్కడ స్థలాలు తీసుకున్నారు. లేఅవుట్‌కు అవసరమైన రోడ్లు, కమ్యూనిటీ అవసరాల కోసం ఓపెన్ స్పేస్ కూడా కేటాయించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు వైసీపీ నేతలు కన్నేసి ఈ స్థలాల ఆక్రమణపై దృష్టి పెట్టారు. ఎన్జీవోలకు కేటాయించిన లేఅవుట్ స్థలానికి మంచి డిమాండ్ ఉంది. సెంటు ఇక్కడ రూ.10 లక్షల వరకు పలుకుతోంది. ఇది మంచి ప్రైమ్ ఏరియా. అయితే దీనిపై వైసీపీ నేతలు కన్నేశారు. ఎన్జీవో ప్లాట్లు కేటాయించిన లబ్ధిదారుల జాబితా చెక్ చేసుకుని వారి బలహీనతలను కనుగొని రంగంలోకి దిగుతారు. వందల్లో ఫోర్జరీ పట్టాలు తయారు చేసినట్లు చెబుతారు. ఇందులో ఓ ప్రజాప్రతినిధి, ఓ విద్యాసంస్థ అధినేత, మరికొందరు వైసీపీ కీలక నేతలుండడం గమనార్హం. ఇక్కడ 60 అడుగులకు పైగా రహదారుల కోసం స్థలాలు కేటాయించారు. రోడ్డు స్థలంలో ఓ విద్యాసంస్థల నేత 13 ప్లాట్లు, ఓ ప్రజాప్రతినిధి 8 ప్లాట్లు, ఇంకో వ్యక్తి ఐదు ప్లాట్లకు ఫోర్జరీ పుట్టించి స్వాధీనం చేసుకుని లగ్జరీగా అనుభవిస్తున్నారు. ఎన్జీవో ప్లాట్లలో రోడ్ల కోసం కేటాయించిన స్థలాలు 80 శాతం ప్రస్తుతం వైసీపీ నేతల చేతల్లో ఉంటాయంటారు. వీటి విలువ వందకోట్ల పైనే ఉంటుంది. ఇక లబ్ధిదారుల ప్లాట్ల పేరుతోనే పెద్ద ఎత్తున బినామీలు ఇచ్చేసి భారీ స్థాయిలో కొల్లగొట్టారు.

పులివెందుల అభయం

బద్వేలు భూకబ్జాలపై పాదయాత్ర సందర్భంగా అప్పట్లో నారాలోకేశ్ తీవ్ర ఆరోపణలు చేశారు. రూ.2 వేల కోట్లు భూకబ్జాలు జరిగాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చారు. వైసీపీ హయాంలోనే ఫోర్జరీ పత్రాలపై కేసు నమోదైంది. అయితే ఆ కేసు కీలక వ్యక్తుల వద్దకు వెళ్లకుండానే క్లోజ్ చేశారు. ఇటీవలే మరలా పోలీసులు ఆ కేసు ఓపెన్ చేసి ఇన్వెస్టిగేషన్ స్టార్ట్ చేశారు. పలువురిని విచారిస్తున్నారు. సంతకాలు పెట్టిన వారు, షీల్లు చేసిన వారితో విచారణ ముగిస్తారా, లేక అంతిమ లబ్ధిదారులు ఎవరు చెబితే చేశారనే వారిని పట్టుకొచ్చి బొక్కలో వేస్తారా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇక బద్వేలు రెవెన్యూ డివిజనులో జరిగిన భూకబ్జాలపై ఫిర్యాదులు వస్తే బద్వేలు ఆర్డీఓ ఆఘమేఘాలపై స్పందిస్తూ కబ్జాలపై విరుచుకుపడుతున్నారు. కానీ భూకబ్జాల్లో పురోగతి కనిపించడం లేదనే విమర్శలున్నాయి. కూటమి నేతలు ఆపుతున్నారా అన్న చర్చ నడుస్తోంది. బద్వేలులో భూములన్నీ గోపవరం రెవెన్యూ పరిధిలోకి వస్తాయి. అయితే అక్కడ పనిచేసే ఓ అధికారికి పులివెందుల బ్యాక్ గ్రౌండ్ ఉండడం, అందులోనూ వైసీపీ నేతల ఫ్యామిలీతో సంబంధాలు ఉన్నట్లు చర్చ నడుస్తోంది. ఎన్జీవో లేఅవుట్‌లో జరిగిన కబ్జాల ముఠాను బయటకు వెలికితీస్తారా... లేక సైలెంట్ అయిపోతారో వేచిచూద్దాం.

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బద్వేలు పట్టణం బస్తీ అవుతుందని కాలజ్ఞాన పత్రాల్లో రాసి వున్నారు. అయితే ఆయన ఇదే బద్వేలులో కబ్జాకోరులు పుట్టుకొస్తారని, ప్రభుత్వ స్థలాలే కాదు.. ప్రైవేటు స్థలాలనూ కబ్జా చేస్తారని ఊహించి వుండరు. ఎందుకంటే బ్రహ్మంగారు చెప్పినట్లు బద్వేలు పట్టణం బస్తీ వైపు అడుగులు వేస్తోంది. పట్టణం చుట్టూ విస్తరిస్తోంది. వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలు కొందరు దీన్ని బాగా క్యాష్ చేసుకున్నారు. అదెలాగంటే .. మునుపెన్నడూ లేని విధంగా కేవలం ఐదేళ్లలో బద్వేలును కబ్జాల గడ్డగా మార్చివేశారు. ప్రభుత్వ స్థలాలే కాకుండా వాగులు, వంకలు కూడా ఆక్రమించేశారు. ఇక ఏకంగా నకిలీ పత్రాలు తయారు చేసి లేఅవుట్‌లలో ఉండే రోడ్లు, స్థలాలను వారి కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. ఒక్కో ఇంటి పట్టాపై ఐదారు నకిలీవి పుట్టుకొచ్చాయంటే వారు ఏ మేరకు బరితెగించారో అర్థం చేసుకోవచ్చు.

డిమాండ్ల సాధనకై భిక్షాటన



భిక్షాటన చేస్తున్న కార్మికులు

కడప ఎర్రముక్కపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వినూత్నంగా భిక్షాటన చేపట్టారు. సోమవారం కడప కార్పొరేషన్ ఎదుట జోలెపట్టి భిక్షాటన చేశారు. జీతాల పెంపుతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యాల వల్ల తాము బిచ్చగాళ్లుగా రోడ్డున పడ్డామని ఆవేదన చెందారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర అధ్యక్షుడు రవి, గోపి, సుబ్బయ్య పాల్గొన్నారు. కాగా కార్మికులకు మేయర్ సురేశ్‌బాబు మద్దతు తెలిపారు.

కార్మికుల జీతాలు పెంచుతూ జీఓ విడుదల



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే

కడప ఎర్రముక్కపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): కార్మికుల వేతనాలు పెంచుతూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని కడప ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డిలు తెలిపారు. సోమవారం కడప కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్మికులతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటగిరీ-1, 2లో ఉన్న సిబ్బందికి రూ.3 వేలు, కేటగిరీ-3లో ఉన్న సిబ్బందికి రూ.3500 చొప్పున గౌరవ వేతనం పెంచుతూ ప్రభుత్వం 124 ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కార్మికులు దీన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే సమ్మె విరమించాలని, అన్ని రకాల మున్సిపల్ నాన్ పీహెచ్ పొరుగు సేవల సిబ్బంది విధుల్లో చేరాలని కోరారు. కాగా గత కొన్నిరోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే.

సమ్మె కొనసాగుతుంది

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వ స్పందన కార్మికుల్లో అసంతృప్తి కలిగించిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని భవిష్యత్ కార్యచరణ రూపొందించేందుకు మంగళవారం సమ్మెను కొనసాగించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు.

రాయలసీమ జైళ్లశాఖ ఫుల్ అడిషనల్ చార్జ్ డీఐజీగా రవికిరణ్

కడప క్రైం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జైళ్ల శాఖ ఫుల్ అడిషనల్ చార్జ్ డీఐజీగా రవికిరణ్‌ను నియమిస్తూ డీజే అంజనీ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జైళ్ల శాఖ ఇన్‌చార్జ్ డీఐజీగా, కడప సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారిగా రాజేశ్వర్‌రావు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. అయితే ఆయనను తొలగిస్తూ రవికిరణ్‌కు పూర్తి బాధ్యతలను అప్పగించారు.

ఆర్ఐఓగా వెంకటేశ్వర్లు

కడప ఎడ్యుకేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కడప డీవీఈఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆర్ఐఓగా ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు సోమవారం కడప ఆర్ఐఓ కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఆర్ఐఓగా విధులు నిర్వహించిన వెంకటసుబ్బయ్య కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా బదిలీపై వెళ్లారు.

డెకాయి ఆపరేషన్ చేపడతాం

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీత ● ముమ్మరంగా స్కానింగ్ కేంద్రాల తనిఖీలు



అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరం, రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ గీత

ప్రొద్దుటూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ లింగనిర్ధారణకు పాల్పడే వారిపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాం. ఆధారాల కోసం శోధిస్తున్నామని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గీత పేర్కొన్నారు. డెకాయి ఆపరేషన్ చేపట్టామని, క్షేత్రస్థాయిలో చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తున్న డయాగ్నస్టిక్, నర్సింగ్‌హోం నిర్వాహకులు, దళారీ వ్యవస్థపై నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కాసుల కక్కుర్తితో లింగనిర్ధారణకు పాల్పడుతూ బహిరంగంగా సాగుతున్న బ్రోకర్ల దందాపై సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'లోకం చూడకనే... అనంత లోకాలకు...!' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా, పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వారికి అందిన సమాచారం మేరకు పట్టణంలోని జ్యోతి నర్సింగ్‌హోం, సీఎస్ఆర్ నర్సింగ్‌హోంలలో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. మండల పరిధిలోని ఖాదర్‌బాద్ గ్రామంలో ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ గీత మాట్లాడుతూ ఇప్పటి వరకు చేపట్టిన తనిఖీల్లో తమకు ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. డెకాయి ఆపరేషన్ నిర్వహిస్తున్నామని, చట్టాన్ని అతిక్రమించిన వారికి మూడు నుంచి అయిదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు జరిమానా ఉంటుందని చెప్పారు. లింగ నిర్ధారణ వెల్లడి ఆధారాలతో రుజువైతే సంబంధిత డయాగ్నోస్టిక్ వైద్యుల లైసెన్సు, వారి సర్టిఫికెట్లు శాశ్వతంగా భారత వైద్య మండలి రద్దు చేస్తుందని హెచ్చరించారు. ప్రొద్దుటూరు కేంద్రంగా సాగుతున్న దళారులపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. లింగనిర్ధారణ వెల్లడిపై ప్రజల వద్ద సమాచారం ఉంటే నిర్భయంగా తమకు సమాచారం అందించాలని అందుకు తగిన చర్యలు తీసుకుంటామని పిలుపునిచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పతనమైన చీనీ ధరలు

చీనీ రైతులు రోజురోజుకు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు ధర ఉంటుందో ఎప్పుడు ఉండదో అంతుబట్టక ఆవేదన చెందుతున్నారు. పులివెందుల మార్కెట్‌లో వారం క్రితం వరకు టన్ను రూ.20వేల నుంచి రూ.27వేలు పలికింది. ప్రస్తుతం రూ.10వేల నుంచి రూ.20 వేల లోపే పడిపోయింది. సీజన్ క్రాప్ చేతికొచ్చే సమయంలో ధరలు పడిపోవడం రైతులను తీవ్రంగా కలచివేస్తోంది.

● వారం క్రితం టన్ను
రూ.20 వేల నుంచి రూ.27వేలు
● ప్రస్తుతం
రూ.10 వేల నుంచి రూ.20 వేల లోపే
● ధర తగ్గడంపై రైతుల ఆందోళన



పులివెందుల మార్కెట్‌యార్డులో అమ్మకానికి వచ్చిన చీనీకాయలు

పులివెందుల, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పులివెందుల ప్రాంతం చీనీ సాగుకు పెట్టింది పేరు. పులివెందుల నియోజకవర్గంలో దాదాపు 20వేల ఎకరాల్లో చీనీతోటలు సాగులో ఉన్నాయి. చీనీతోటలు సాగుచేసిన ఐదేళ్లపాటు దిగుబడి రాకపోయినా రైతులు కన్నబిడ్డల్లా చూసుకుంటారు. కానీ దిగుబడులు వచ్చే సమయంలో రైతులకు ధర కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రెండేళ్లుగా దిగుబడి ఉన్న సమయంలో ధరలు దారుణంగా పడిపోతున్నాయి. తోటల్లో దిగుబడి లేని సమయంలో ధర ఎక్కువగా ఉంటోంది. మరీముఖ్యంగా పులివెందుల మార్కెట్ యార్డులో చీనీ వ్యాపారం ప్రారంభించినప్పటి నుంచి దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిలువునా ముంచేస్తున్నారు. ఇరవై రోజుల క్రితం వరకు పులివెందుల మార్కెట్‌లో టన్ను చీనీధర రూ.20వేల నుంచి రూ.27వేల వరకు ఉండేది. కానీ వారం రోజులుగా ధర పడిపోయింది. ప్రస్తుతం పదివేల నుంచి ఇరవై వేలలోపు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

డిసెంబరు నెలలో కాపు వచ్చిన పంట ప్రస్తుతం కోత దశకు చేరింది. అక్టోబరు నాటికి పంట పూర్తిగా మార్కెట్‌కు తరలించాల్సిందే. లేదంటే తోటల్లోనే కాయలు రాలిపోతాయి. ఈ సమయంలో పంటకు ధర ఉంటేనే రైతులకు లాభాలు వస్తాయి. లేదంటే నష్టాలు చవిచూడాల్సిందే. ఒకపక్క ఎరువుల ధరలు, పురుగుమందుల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో.. మరోవైపు దిగుబడుల ధరలు పతనం అవుతుండటంతో చీనీ రైతులు నష్టాలను చవిచూస్తున్నారు.

పులివెందుల నియోజకవర్గంలో లింగాల, సింహాద్రిపురం మండలం చీనీ పంటకు పెట్టింది పేరు. ప్రస్తుతం లింగాల రైతులు దాదాపు చీనీ తోటలను తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. వీటి స్థానంలో అరటిసాగుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మార్కెట్ యార్డులో దళారుల బెడద తగ్గించి చీనీకాయలకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ధర లేకపోతే ఎలా అమ్ముకోవాలి..



12 ఎకరాలలో చీనీతోట సాగుచేశాను. ప్రస్తుతం సీజన్ క్రాప్ కోతకొచ్చింది. ఈ నెలో రేపు నెలో పంట తరలించాల్సిందే. ఈలోగా ధరలు పూర్తిగా పడిపోయాయి. బయటి వ్యక్తులకు పంట అమ్ముదామంటే తోటల వద్దకు వ్యాపారులు రావడం లేదు. పులివెందుల మార్కెట్‌లో ధర చూస్తే టన్ను రూ.10వేల నుంచి రూ.18వేలు చెబుతున్నారు. ఇలా అయితే చీనీతోటలపై ఆశలు వదులుకోవాల్సిందే.

- కొమ్మా సూర్యప్రకాశ్‌రెడ్డి, చీనీ రైతు, అగ్రహారం, సింహాద్రిపురం మండలం

పీలేరు సొగసు చూడతరమా..!

'ప్రముఖ విద్యా వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న పీలేరు పట్టణం ఒక్క రాత్రి కురిసిన వర్షానికి ఉక్కిరిబిక్కిరైంది. జనం కంటి మీద కునుకు లేకుండా పోయింది. పట్టణంలోని పలు ప్రధాన వీధులు మురుగు కాలువలను తలపించాయి. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్ స్టేషన్ చెరువును తలపించింది. ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రధాన రహదారి నుంచి ఎస్‌వీ మహల్, సత్యప్రియ లాడ్జి, గుప్త హాస్పిటల్, ఎస్‌వీ డీలక్స్ మార్గం రూపురేఖలు మురుగునీటి ధాటికి పూర్తిగా మారిపోయాయి. కట్టుకాలువ వీధి, గోరీల తోపు, రాజీవ్‌నగర్ కాలనీ రహదారిపై మురుగునీటి ప్రవాహంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణ శివారులోని మోడల్ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో జనం కష్టాలపాలయ్యారు.


పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో నిలిచిన వర్షపునీరు

- రోడ్లపై మురుగు ప్రవాహం
- చెరువును తలపిస్తున్న ఆర్టీసీ బస్ స్టేషన్
- వీధుల్లో మేట వేసిన ఇసుక
- మోడల్ కాలనీలో ఇళ్లలోకి.. వర్షపు నీరు
- పట్టించుకోని అధికారులు

పీలేరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంలో నాలుగు చినుకులు పడినా పట్టణమంతా మురుగుమయమవుతోంది. మురుగు కాలువల ఆక్రమణలు, ముందు చూపులేకుండా సీసీ రోడ్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం వల్లే సమస్య జటిలంగా మారుతోంది. గురువారం రాత్రి 66 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, పట్టణంలోని మురుగు కాలువలు, వీధులు ఏకమై పలు ప్రాంతాల్లో ఇసుక మేట వేసింది.

చెరువులా ఆర్టీసీ సముదాయం..

నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటే ఆర్టీసీ బస్‌స్టేషన్ సముదాయం చెరువును తలపిస్తుండగా, దుకాణాల్లోకి నీరు చేరడంతో వ్యాపారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ నల్లగుట్ట శ్రీకృష్ణదేవరాయనగర్, క్రాస్‌రోడ్ తదితర ప్రాంతాల నుంచి వర్షపునీరు, మురుగు బస్ స్టేషన్‌లోకి రాకుండా నివారణ చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు విఫలమౌతున్నారు.

రోడ్లపై ఇసుక మేటలు...

పట్టణంలో పలు చోట్ల ఇసుక మేట వేయడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని తిమ్మారెడ్డి క్రాస్, పోలీస్ క్వార్టర్స్, కడప రోడ్, కోటపల్లె మార్గం, రైల్వే అండర్ బ్రిడ్జి, యల్లమంద క్రాస్, ట్రెండ్స్ తదితర ప్రాంతాలలో రహదారిపై ఇసుక మేటలతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కాలువలను తలపిస్తున్న వీధులు..

పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ, గోరీల తోపు మార్గం పూర్తిగా మురుగు నీటితో నిండిపోయాయి. దీంతో పాదచారులు, వాహన చోదకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటపల్లె మార్గంలో మురుగు కాలువలు, వీధులు ఒక్కటయ్యాయి. ఎక్కడికక్కడే మురుగు నీరు రోడ్లపై నిలిచిపోయింది. చిత్తూరు, మదనపల్లె మార్గంలో, ఆర్‌వోబీ పనులు జరుగుతున్న ప్రాంతాలు వర్షంధాటికి ప్రమాదకరంగా మారాయి.

అధికారుల నిర్లక్ష్యం...

అధికారులు కార్యాలయాలకే పరిమితమై, సమస్యలపై దృష్టి సారించకపోవడమే ఈ దుస్థితికి కారణమన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణ సమయంలో అధికారులు మొక్కుబడి తనిఖీలతో సరిపెట్టుకోవడం వల్లే సమస్య జటిలంగా మారిందని అంటున్నారు.



కోటపల్లె, యల్లమంద క్రాస్ వద్ద రోడ్డుపై మురుగు

ప్లాస్టిక్ వ్యర్థాలు.. ఆక్రమణలే కారణం



ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ నిర్లక్ష్యంగా పడేయడం, మురుగు కాలువలు ఆక్రమణల బారిన పడడం తోనే మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. పీలేరు గ్రామ పంచాయతీ అధికారులతో పాటు పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

- గోపీనాథరెడ్డి, రిటైర్డ్ ఈఈ, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్


మురుగును తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

రైతుల సంక్షేమం కోసమే 'పీఎం ప్రణామ్'

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అగ్రికల్చర్ జేడీలు

రాయచోటి(కలెక్టరేట్), జూలై21(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం ప్రణామ్ స్కీమ్ ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో పచ్చిరొట్ట జీవన ఎరువుల గోడ పత్రికను జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బయో ఎరువులు, సేంద్రియ ఎరువులతో కలిపి ఎరువుల సమతుల్య వినియోగాన్ని ప్రోత్సహించడమే ఈ స్కీం ప్రధాన లక్ష్యమన్నారు. ఈ పథకం ద్వారా కృత్రిమ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని పెంచడమే ప్రధాన ఉద్దేశమన్నారు. దీంతో ఆరోగ్యమైన నేలతో పాటు భూసారం, పోషకాల లభ్యత పెరిగి నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని కలెక్టర్ తెలిపారు.

పారిశుధ్యం తీరుపై కేంద్ర బృందం అసహనం


గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

పెనగలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నారాయణనెల్లూరు గ్రామ పంచాయతీలో సోమవారం కేంద్ర బృందం పర్యటించింది. రెండు అంగన్వాడీ కేంద్రాలు, ఒక ఎలిమెంటరీ పాఠశాల, హెల్త్ సెంటర్, చెత్త సేకరణ కేంద్రాలను తనిఖీ చేసింది. కొన్ని కుటుంబాలు నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను కూడా పరిశీలించి. అన్నిచోట్ల పారిశుధ్యం సరిగా లేదని, దానిపై ప్రజలకు సరైన అవగాహన కల్పించలేదని ఈ సందర్భంగా బృంద సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. పంచాయతిరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించిన దాఖలాలు లేవని స్పష్టంగా తెలుస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు మినహా మిగిలినవారు లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే టైపిస్టు అనిత కేంద్ర బృందానికి సహకరించారు. ఈ విషయంపైన కూడా సంబంధిత అదికారులు లేకుండా శాఖలకు సంబంధం లేని వారు సమాధానం చెప్పడంపై కూడా వారు అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ శానిటేషన్ టీమ్ సభ్యులు ఎం.సుబ్బరాయడు, స్వచ్ఛభారత్ గ్రామీణ కన్సల్టెంట్ బి.మద్దిలేటి, గ్రామ సర్పంచ్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండలో పూజలు

తంబళ్లపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): తంబళపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ సోమవారం భక్తులతో కిటకిటలాడింది. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా భక్తులు మల్లయ్యకొండకు వచ్చి భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఈశ్వరప్ప స్వామి వారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. కొండపైన గౌరమ్మ అమ్మవారికి, ఏనుగు మల్లమ్మకు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మునిరాజ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు.


పూజలు నిర్వహిస్తున్న ఈశ్వరప్ప

ఉజ్జయిని మహంకాళికి ఆషాఢం సారె


ఆషాఢం సారె సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పెనగలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెస్తపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి ఉజ్జయిని మహంకాళికి ఆదివారం రాత్రి సమరత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆషాఢమాస సారె కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు స్థానిక అనంతపురం గంగమ్మ దేవాలయం నుంచి మంగళవాయిద్యాలతో మహిళలు పసుపు, కుంకుమ, చీర, రవిక, గాజులు, పసుపు కొమ్ములు, తాలిబొట్టు, దారం, వడిబియ్యం, పూలు, పండ్లతో పాటు మంగళకరమైన వస్తువులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా పరియోజన సహ ప్రముఖ జయరామిరెడ్డి, బాలవికాస ఉపాధ్యాయ జిల్లా సహ కన్వీనర్ వెంకటరమణయ్య, రాజంపేట సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ౧

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిద్దవటం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని చాముండేశ్వరిపేటకు చెందిన నారపురెడ్డి రామచంద్రారెడ్డి(60) సోమవారం రాత్రి బాకరాపేట సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కడప చెన్నై జాతీయ రహదారిని దాటుతుండగా తిరుపతి వైపు నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొని వెళ్లిపోయింది. ఈ విషయంపై స్థానికులు హైవే పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందించడంతో కడప నగర సమీపంలో బస్సును అదుపులోకి తీసుకున్నారు. మృతిచెందిన వ్యక్తికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు మృతుని బంధువులు తెలిపారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ, పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

తాగునీరు సరఫరా చేయాలి

- ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన


ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

సిద్దవటం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో క్యాన్‌కు రూ. 20 చొప్పున చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందంటూ మండలంలోని మాధవరం-1, పార్వతిపురం, వెంకటేశ్వరపురం, రామకృష్ణపురం గ్రామాలకు చెందిన మహిళలు సోమవారం మండల కేంద్రంలో ఖాళీ బిందెలతో వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించనిపక్షంలో గ్రామ సచివాలయాన్ని ముట్టడిస్తామని, ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురుప్రసాద్‌ను వివరణ కోరగా మాధవరం గ్రామానికి వెళ్లే పైపులైను సిద్దవటం బ్రిడ్జి సమీపంలో దెబ్బతిందని, దీనికిమరమ్మతులు చేస్తున్నామని మంగళవారం నుంచి క్రమం తప్పకుండా తాగునీరు అందిస్తామని తెలిపారు.

చదువులబాబుకు జీవన సాఫల్య పురస్కారం


డీకే చదువులబాబును సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత డీకే చదువులబాబుకు జీవన సాఫల్య జాతీయ సాహిత్య సేవా పురస్కారం ప్రదానం చేశారు. ఆదివారం హిందూపురంలోని సెవన్ స్టార్ ఫంక్షన్ హాలులో భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, శ్రీ సత్యసాయిజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో చదువుల బాబుకు జాతీయ సాహిత్య సేవా పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్, సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు చాంద్‌బాషా, అఖిలభారత టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షుడు ఉమర్‌ఫరూక్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలికి సన్మానం


నాగూర్‌వలిని సన్మానిస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ అండ్ టూ డిపోల ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్ వలిని కూటమి నాయకులు సోమవారం కమ్మవీధిలోని జనసేన పార్టీ కార్యాలయంలో దుశ్శాలువలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా జనసేన రాయలసీ కో- కన్వీనర్ గంగారపు రామదాస్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించి ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని, డిపోలోని అన్ని యూనియన్ల నాయకులను కలుపుకుని పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన ఈయూ గౌరవాధ్యక్షుడు నాగూర్‌వలి మాట్లాడుతూ డిపోల్లో సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకారం అందించిన కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరాం, టీడీపీనాయకులు సీడ్ మల్లికార్జున నాయుడు, యాలగిరి దొరస్వామినాయుడు, గిరి, బ్యాంకు రమణ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- సీఐటీయూ నేత అబ్బవరం రామాంజులు


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీతాల పెంపుతో పాటు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 9వ రోజు ఒంటికాలి మీద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, శంకరయ్య, అక్బర్, చెన్నయ్య, రాంబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు జీతం పెంపుతో పాటు సామాజిక భద్రతకై సంక్షేమ పథకాల అమలు, వయో పరిమితి 62 ఏళ్ల పెంపు, విధి నిర్వహణలో చనిపోయిన వర్కర్స్‌కు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలనే అంశం మీద పరిశీలిస్తామనడం సరైంది కాదన్నారు. అన్ని డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె విరమించబోమని తెలిపారు. మున్సిపల్ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, ఈశ్వర్‌రెడ్డి, తిరుపాల్, మంగమ్మ, రెడ్డిప్రసాద్, లక్ష్మిదేవి, కృష్ణారెడ్డి, బ్రహ్మయ్య, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు, ఆటో ఢీ : ఆరుగురు విద్యార్థులకు గాయాలు



సంఘటనా స్థలంలో బస్సు, ఆటో


108లో తరలుతున్న విద్యార్థులు


పరామర్శిస్తున్న సీడు మల్లికార్జున నాయుడు

కురబలకోట, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ బస్సు, ఆటో ఢీకొనడంతో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అంగళ్లు సమీపంలోని ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన బస్సు సోమవారం సాయంత్రం విద్యార్థులను ఇళ్లకు తీసుకెళుతుండగా, ముదివేడు క్రాస్ వద్దనున్న మోడల్ స్కూల్ విద్యార్థులతో వెళుతున్న ఆటో ఇళ్ళకు బయలుదేరి నడింపల్లె గ్రామ సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు విద్యార్థులు గాయపడ్డారు. విషయం గమనించిన స్థానికులు 108 వాహనంలో విద్యార్థులను మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. రోడ్డుపక్క నున్న పొలంలో బోరు వేస్తుండడంతో వెలువడిన ధూళి కారణంగా దారి కనిపించకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● టీడీపీ నేత మల్లికార్జునాయుడు పరామర్శ

మదనపల్లె : ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులను తంబళపల్లె నియోజకవర్గ టీడీపీ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు పరామర్శించారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చేరుకుని గాయపడిన శివమణి, పల్లవి, లహరి, యశ్వంత్, మంజుల, కేశవ, అమృతను పరామర్శించారు. కురబలకోట మండల టీడీపీ అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, నేతలు దేరంగుల చంద్ర, సోమశేఖర్, రాజారెడ్డి, శివలింగారెడ్డి ఆయనకు సహకరించారు. దీంతో ఆయనను స్థానిక నాయకులు ప్రజలు తదితరులు ప్రశంసించారు

అతివేగం.. నిర్లక్ష్యం..!


చెన్నామర్రి మిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

● నెత్తురోడుతున్న రహదారులు.. ● దివ్యాంగులుగా మారుతున్న యువకులు ● రోడ్డున పడుతున్న కుటుంబాలు

కురబలకోట, జులై 21 (ఆంధ్రజ్యోతి): వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడడం, కునుకు పాటు, మద్యం సేవించడం, అతివేగం, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు పరిపాటిగా మారాయి. దీంతో పెద్ద దిక్కు కోల్పోయి పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఎంతో మంది వికలాంగులుగా మారుతున్నారు. ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం జారీ చేస్తున్న హెచ్చరికలను పట్టించుకోకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా మారు తోంది. ముంబై- చెన్నై, కడప- మదనపల్లె మార్గాల్లో ఈ ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా, ఎంతో మంది అంగ వైకల్యాన్ని పొందారు. ఈ ఏడాది జనవరి నుంచి మండలంలో జరిగిన ప్రమాదాల వివరాలిలా..

● ఈ ఏడాది జనవరి 2న ముదివేడు టోల్‌ప్లాజా వద్ద ఇన్నోవా కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో చేనేత నగర్‌కు చెందిన కార్మికుడు గంగులరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు.


ముదివేడు క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం (ఫైల్)

● జనవరి 16న అంగళ్లు సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద ప్రైవేట్ బస్సు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడ డంతో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు.

● 22న కురబలకోట ఫ్లై ఓవర్ వద్ద ద్విచక్ర వాహ నం బోల్తాపడి రాయచోటికి చెందిన ఫైజాన్(22), ఫహద్ తీవ్రంగా గాయపడ్డారు.

● ఫిబ్రవరి 4న మండలంలోని దాదాంవారిపల్లెకు చెందిన ఈశ్వరప్ప, రాజేశ్వరమ్మ కారులో బెంగళూ రుకు వెళ్లి తిరిగి వస్తుండగా టైరు పేలడంతో వాహనం అదుపుతప్పి గాయపడ్డారు.

● 14న మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ధర్మపురికి చెందిన సతీష్ కుమార్ గాయపడ్డాడు.

● 21న అంగళ్లు బైపాస్‌రోడ్డులో టెంపో, లారీ ఢీకొనడంతో ములకలచెరువు మండలం రాయపు వారిపల్లెకు చెందిన డ్రైవర్ మనోహర్(25) అక్కడి కక్కడే మృతి చెందాడు.

● మార్చి 18న కడప-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిలోని మధ్యాహ్నంవారిపల్లె సమీపంలో కారు, బస్సు ఢీకొనడంతో కడప పట్టణానికి చెందిన జహీర్(27) అక్కడిక్కడే మృతి చెందాడు.

● 20న ముదివేడు క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెంద గా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

● ఏప్రిల్ 2న రిషివ్యాలీ క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా మండ్యంవారిపల్లెకు చెందిన వెంకటరమణ తీవ్రంగా గాయపడాడు.

● మే 7న అంగళ్లు సమీపంలో రెండు ద్విచక్ర వా హనాలు ఢీకొనడంతో ఇంజనీరింగ్ విద్యార్థి కింద ఎడిపోయాడు. అదే సమయంలో అతనిపై ట్రాక్టర్ వెళ్లడంతో పెద్ద మండ్యం మండలంలోని కలిచెర్ల సమీపంలో శెట్టివారిపల్లెకు చెందిన వెంకటేష్ కుమా రుడు వెంకటరమణ (22)మృతి చెందాడు. సీటీఎం రోడ్డులో ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో కనసానివారిపల్లె కాలనీకి చెందిన విష్ణువర్ధన్(24) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అతని స్నేహితులు వెంకటేష్‌బాబు, బాబా ఫక్రుద్దీన్ గాయపడ్డారు.

● 9న దొమ్మన్నబావి సమీపంలో టమోటా లారీ, కారు ఢీకొనడంతో డ్రైవర్ గాయపడ్డాడు.

● 21న మండలంలోని ముదివేడు క్రాస్ వద్ద ఐషర్ వాహనం, కారును ఢీకొనడంతో బస్సు కోసం రోడ్డు పక్కన వేచియున్న ములకలచెరువు మండలం చౌటకుంటపల్లెకు చెందిన రెడ్డెమ్మ(50), సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నారేవాండ్లపల్లెకు చెందిన అరుణమ్మ(56), కలకడ మండలం పాపిరెడ్డిగారి ఎల్లెకు చెందిన వెంకట్రమణ గాయపడ్డారు.

● మే 30న బెంగళూరు నుంచి రాయచోటికి వెళుతుండగా మండలంలోని జంగావారిపల్లె సమీ పంలో కారు డివైడర్‌ను ఢీకొనడంతో రాయచోటికి చెందిన ఖాదర్ కుమారుడు నవాజ్(24) అక్కడిక్కడే మృతి చెందగా, మహమ్మద్ అలీఖాన్(24), ముజిమిల్(24), ఖాదర్‌ఖాన్(24), సుహేల్(24) గాయపడ్డారు.

● జూన్ 30న మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద టెంపో ట్రావెల్, కంటైనర్ ఢీకొనడంతో కర్ణాటక కు చెందిన ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందగా, 10మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఎస్‌హెచ్‌జీ రుణాలతో సాధికారిత

● ఆర్థిక ప్రగతి సాధిస్తున్న డ్వాక్రా గ్రూపు మహిళలు





పోరుమామిళ్లలో వెలుగు మహిళా మార్ట్

పోరుమామిళ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : భర్త సంపాదనే కాకుండా భర్త కష్టంలో చేదోడు వాదోడుగా ఉంటూ.. ఆ మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు పొందుతూ సాధికారత సాధిస్తున్నారు పోరుమామిళ్ల మండలంలో 1286 స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయి. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబ బాధ్యతలలో తమ వంతు భాగస్వామ్యులవుతూ ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. డ్వాక్రా రుణాలు పొందిన వారు బేకరీలు, బట్టల షాపులు, రెడిమేడ్ షాపులు, చిన్న చిన్న ఫ్యాన్సీస్టోర్‌లు నిర్వహిస్తూ ప్రగతిని సాధిస్తున్నారు. అంతేకాకుండా 18 నెలల క్రితం పోరుమామిళ్లలో వెలుగు మహిళామార్ట్‌ను కూడా ప్రారంభించారు. ఇందులో ప్రభుత్వం రూ.10లక్షలు పెట్టుబడులు పెట్టగా, 10వేల మంది సంఘ సభ్యులు దాదాపు రూ.15లక్షలు పెట్టుబడి పెట్టారు. మొత్తం రూ.25లక్షల వ్యయంతో ఈ మార్ట్ అభివృద్ధిపథంలో పయనిస్తోంది. ఇందులో వచ్చే లాభాలను అందరికీ భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకుంటూ సంబంధిత అధికారులు ముందుకు సాగుతున్నారు. అంతేకాక ఇదే మహిళా మార్ట్‌లో నలుగురు డ్వాక్రా సంఘాల సభ్యులు పనిచేస్తున్నారు. ఈ నలుగురికి కలిపి నెలకు రూ.28వేలు జీతాన్ని కూడా పొందుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని అనేక మంది మహిళలు స్వయం సహాయక గ్రూపుల ద్వారా రుణాలు పొంది ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. ప్రస్తుతం మైక్రోక్రెడిట్ ప్లాన్ అమలులో ఉండడంతో 30 గ్రూపులకు చెందిన సభ్యులకు ప్రస్తుతం ఈ మూడు నెలలకు దాదాపు రూ.కోటి 50 లక్షల రుణాలు వచ్చాయి. మిగలిన గ్రూపులకు కూడా రుణాలు అందిస్తే మరింత మంది మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తారని... ఆ దిశగా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తినుబండారాల వ్యాపారం చేస్తున్నాం..



డ్వాక్రాలో చేరిన తరువాత తమ ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. 14 సంవత్సరాల క్రితం డ్వాక్రాలో చేరా. ఐదువేల నుంచి రూ.2లక్షల వరకు రుణాలు పొందే స్థాయికి చేరా. ప్రధానమంత్రి స్కీం ద్వారా తినుబండారాల తయారీకి రూ.10లక్షల విలువైన మిషన్ కూడా వచ్చింది. తన భర్తతో కలిసి మిషన్ రన్ చేస్తూ తిను బండారాల వ్యాపారం చేస్తున్నాం. కంతులు పోను నెలకు రూ.25వేల వరకు తమకు ఆదాయం ఉంటుంది.

-లీలావతి, డ్వాక్రా మహిళ

ఆటోలో దుస్తుల వ్యాపారం...



డ్వాక్రాలో సభ్యురాలిగా ఆర్థిక ప్రగతి సాధించాం. 22 సంవత్సరాల క్రితం డ్వాక్రాలో సభ్యులుగా చేరాం. తన భర్త తిరుపాల్‌తో కలిసి ఆటోల్లో గ్రామాలు తిరిగి బట్టల వ్యాపారం చేస్తాం. నెలకు ఖర్చులు పోను రూ.30వేలు ఆదాయం ఉంటుంది.

-వనపర్తి పెంచలమ్మ,డాక్రా మహిళ

యూరియా కొరత లేదు.. ఆందోళన వద్దు

● జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్

ఖాజీపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరతలేదని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రానాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కూనవారిపల్లె రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి యూరియాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అనవసరంగా మోతాదుకు మించి యూరియాను వినియోగిస్తున్నారని.. దీంతో భూసారం దెబ్బతింటుందన్నారు. ఖరీఫ్‌లో రైతులు ఎకరాకు వంద కేజీలు మూడు దఫాలుగా వేసుకుంటే సరిపోతుందని.. దుక్కిలో మాత్రం పొటాష్ ఎరువులు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. జిల్లాలో యూరియా రైతులకు కావాల్సిన మేరకు ఉంది, ప్రతి రైతుసేవా కేంద్రానికి అందజేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ శాఖాధికారి గోవర్ధన్, మండల వ్యవసాయ శాఖాధికారి నాగార్చన, వ్యవసాయ సహాయకులు అశోక్‌కుమార్, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాగుబోతుల రక్తంతో రాజకీయాలు చేయాలనుకోవడం సిగ్గుచేటు : తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 21(ఆంధ్రజ్యోతి): తాగుబోతుల రక్తంతో ప్రభుత్వాలను నడపాలని, రాజకీయాలు చేయాలనుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. మద్యం కుంభకోణంలో వెలుగు చూస్తున్న విషయాల ద్వారా జగన్ పులివెందుల పరువు, కడప జిల్లా పరువు తీశాడని... ముఖ్యమంత్రి పదవికి కళంకం తెచ్చాడని ఆవేదన వెలిబుచ్చారు. తాగుడు వ్యక్తికి, కుటుంబానికి, ప్రభుత్వానికి, సమాజానికి నష్టం, ప్రతి నేరం వెనుక తాగుడు ఉంటుందన్నారు. గుజరాత్, బీహార్, మిజోరాం, నాగాలాండ్, లక్షదీవులలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తున్నాయన్నారు. మద్యపాన నిషేధాన్ని అమలుచేస్తే ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. గుజరాత్‌లో సొంత రెవెన్యూ రాబడి స్టేట్ జీఎస్టీ 48శాతం కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 11.40శాతం మాత్రమే అన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు సాధ్యం కాదు, ప్రభుత్వాలకు నిధుల కొరత ఏర్పడుతుందని చెప్పడంలో వాస్తవం లేదన్నారు.

మోటారు బైకు అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి పడి ఒకరు మృతి

● మరొకరికి తీవ్రగాయాలు



శ్రీరాములు మృతదేహం

కాశినాయన జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకమర్రి బ్రిడ్జి పైనుంచి సోమవారం మోటారు బైకు అదుపుతప్పి కిందపడటంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ యోగేంద్ర వివరాల మేరకు... తెలంగాణ రాష్ట్రం వనపర్తి సమీపంలోని క్రిష్ణగిరి గ్రామానికి చెంది చింతపండు శ్రీరాములు(27) వంకమర్రి గ్రామానికి చెందిన రమణయ్య వద్ద ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం వ్యక్తిగత అవసర నిమిత్తం శ్రీరాములు, వంకమర్రి గ్రామానికి చెందిన సంద్రపల్లె వెంకటనానితో కలసి వంకమర్రి నుంచి పోరుమామిళ్లకు బయలుదేరారు. మోటారు బైకు వంకమర్రి పాత బ్రిడ్జిపైకి రాగానే అదుపుతప్పి కిందపడింది. ఈప్రమాదంలో శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటనానికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడ నుంచి కడపకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు సందర్శించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా.... ఐదుగురికి తీవ్ర గాయాలు



గాయపడిన వారు చికిత్స పొందుతున్న దృశ్యం

బద్వేలుటౌన్, జులై 21 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం ఉదయం బి.కోడూ రు మండలం మేకవారిపల్లె నుంచి నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం గోవిందాయపల్లెకు వరినాట్లు వేసేందుకు ఆటోలో కూలీలు బయలుదేరి వెళుతున్నారు. నక్కలగండి సమీపం దప్పిలమ్మగుడి వద్దకు రాగానే వర్షం కారణంగా ఆటో అదుపుతప్పి ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంబాన్ని ఢీ కొట్టి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో మేకవారిపల్లె గ్రామానికి చెందిన భాగ్యమ్మ, లావణ్య, సునీత, చిన్నక్కతో పాటు ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

పులివెందులలో ఘర్షణ.. 8మందిపై కేసు

పులివెందుల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని వైఎస్‌ఆర్ కాలనీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చాన్‌బాష తెలిపారు. వంశీ అనే వ్యక్తి ఓ అమ్మాయి ప్రేమిస్తుండేవాడు. ఈ అమ్మాయికి వలీ అనే వ్యక్తితో వివాహం నిశ్చయమైంది. ఈ విషయమై వంశీ, వలీ వర్గాల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. దీంతో వీరిద్దరితో పాటు మరో ఆరోగురిపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిన్నారికి టీకా.. తగ్గని వాపు

● గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేసిన తల్లి



టీకా వేయడంతో చిన్నారి భుజంపై ఏర్పడ్డ గడ్డ

చెన్నూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గుర్రంపాడు పంచాయతీకి చెందిన శ్రీహర్షితరెడ్డి అనే 16 నెలల చిన్నారికి ఈ నెల 9న సచివాలయంలో పనిచేసే ఏఎన్‌ఎం వెంకటసుబ్బమ్మ ఓ టీకా వేసింది. అయితే టీకా ఇచ్చిన మరుసటిరోజే పాప భుజంపై చిన్నపాటి గడ్డలా మారింది. దీంతో భయపడ్డ ఆ చిన్నారి తల్లి రూప ఏఎన్‌ఎం వద్దకు వెళ్లి గట్టిగా అడగ్గా అదేమీ కాదు మానిపోతుంది, ఆందోళన వద్దు అని చెప్పడం జరిగింది. అయితే రోజులు గడిచే కొద్దీ తగ్గకపోవడంతో ఆమె కడప నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఆశ్రయించింది. అక్కడ పరిశీలించిన వైద్యులు నయం అయ్యేందుకు సమయం పడుతుందని కొందరు, ఏమో చెప్పలేమని ఇంకొందరు రకరకాలుగా చెప్పడంతో భయపడ్డ ఆ తల్లి సోమవారం కలెక్టరు కార్యాలయంలో గ్రీవెన్‌సెల్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వినయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

తీరు మార్చుకున్న మున్సిపల్ పాలక వర్గం



మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు

పులివెందుల రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సార్ మా వార్డులో డ్రైనేజీ సరిగా లేదు.. తాగునీరు సక్రమంగా రావడం లేదు.. వీధిలైట్లు వెలగడం లేదు.. మాకు ప్రభుత్వ పథకం రాలేదు.... ఎలా ఏ సమస్య ఉన్నా సచివాలయంలో కంప్లైంట్ ఇవ్వండంటూ.. మొన్నటి వరకు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు చెప్పేవారు. ఇది ఏ మారుమూల వార్డులోని ప్రజలను అడిగిన చెప్పే మాట. పథకాలకు నిధులు విడుదల, ప్రచారాలలో కనిపిస్తూ సొంత కాంట్రాక్టు పనులు చేసుకుంటూ హాయిగా గడిపేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీరు మార్చుకున్నారు. పెండింగ్ పనులకు ప్రస్తుత ప్రభుత్వం సహకరించడం లేదంటూ నిందలు వేయడం మొదలుపెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చిన్న చిన్నపనులు చేయాలంటే నిధులు విడుదల చేయడం లేదు, టెండర్లు పిలిచినా పనులు పూర్తిచేయాలంటే నిధులు నిలబెట్టారు అంటూ గగ్గోలు మొదలుపెడుతూ వస్తున్నారు. అదే విధంగా సోమవారం కూడా మున్సిపాలిటీలో ఇంజనీరింగ్ అధికారులు లేరు, దీంతో చిన్నచిన్న పనులు కావడం లేదు, అభివృద్ధి కుంటుపడుతోందంటూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మున్సిపాలిటీని చిన్నచూపు చూస్తోందంటూ మున్సిపల్ కమిషనర్ ముందు నినందించారు. పనులకు అగ్రిమెంట్లు చేయాలన్నా, బిల్లులు పెట్టాలన్న ఇంజనీరింగ్ అధికారులు సంతకం చేయాల్సి ఉందన్నారు. పులివెందుల అభివృద్ధిని, ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగాన్ని నియమించాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ రాముడుకు వినతిపత్రం అందించారు. ఇదిలా ఉండగా ఎన్నడూ లేని విధంగా మున్సిపల్ పాలక వర్గం పులివెందుల అభివృద్ధి కోసం అధికారులను నియమించాలని నిరసన వ్యక్తం చేయడంపై పలువురు ప్రజలు, అధికారులు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్లపాటు నిధులు వరదలాపారినా విద్యుత్ శాఖకు దాదాపు రూ.30కోట్ల దాకా బకాయిలు ఎందుకు పడ్డారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. దీనిని కూడా కూటమి ప్రభుత్వంపై నెపం నెట్టి... డబ్బులు ఇవ్వలేదు వీధిలైట్లు వెల గడం లేదని చెప్పడం సరికాదని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు.

'శారీరక విభిన్న ప్రతిభావంతులు అప్రమత్తంగా ఉండండి'

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): శారీరక విభి న్న ప్రతిభావంతులు అప్రమత్తంగా ఉండాలంటూ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు ఆర్‌వీ క్రిష్ణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో కొందరు దళారులు మూడు చక్రాల స్కూటర్లు తక్షణం అందిస్తామని హామీ ఇచ్చి అర్హులైన వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ కార్యాలయం దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇటువంటి ప్రకటనల్లో ఎటువంటి నిజం లేదన్నారు. ప్రజలు ఇటువంటి వదంతులు నమ్మకుండా, మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం మూడు చక్రాల స్కూటర్లు పంపిణీకి సంబంధించి ఇప్పటి వరకు ఎటు వంటి అధికారిక ఆదేశాలు కానీ.. బడ్జెట్ కేటాయింపులు కానీ జారీ చేయలేదన్నారు. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడిన తరువాతనే దరఖాస్తుల ప్రక్రియ చేపట్టి అర్హులను గుర్తించి యూనిట్ల కేటాయింపులు పూర్తి పారద ర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ విషయమై పూర్తి సమాచారాన్ని పత్రికల ద్వారా ప్రకటిస్తామని వివరించారు. ఈ రకమైన మోసపూరిత చర్యలకు ఈ కార్యాలయానికి, సిబ్బందికి ఎటువంటి సంబంధంలేదని తెలిపారు. ఎక్కడైనా డబ్బులు వసూలు చేస్తున్న సంఘటనలు తమ దృష్టికి వస్తే సంబంధిత వివరాలను సమగ్రంగా సేకరించి లిఖితపూర్వక ఫిర్యాదులు చేయాలన్నారు. అటువంటి ఫిర్యాదులపై చట్టనిబంధనల ప్రకా రం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయస్థాయి ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలో విజేతగా పవన్‌కళ్యాణ్



పవన్‌కళ్యాణ్‌ను సత్కరిస్తున్న కృష్ణకిశోర్

కడప కల్చరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పెయింటింగ్ పోటీలలో కడపలోని ఓ ప్రయివేటు స్కూల్‌లో ఆర్ట్స్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న బండి పవన్‌కళ్యాణ్ వేసిన పెయింటింగ్ జాతీయస్థాయిలో ఉత్తమ పెయింటింగ్‌గా నిలిచి గోల్డ్‌మెడల్, గోల్డెన్ బ్రష్ ఆర్టిస్ట్ టైటిల్ గెలు పొందాడు. ఆ మేరకు పవన్‌కళ్యాణ్‌ను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో సంబంధిత అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్‌వీ కృష్ణకిశోర్ సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకుని గత మే 7న మన దేశం క్రియేటివ్ ఆర్ట్స్ హార్ట్స్ అకాడమీ వారు ఏర్పాటు చేసిన పెయింటింగ్ పోటీలలో పవన్‌కళ్యాణ్ విజేతగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మైభారత్ (నెహ్రూ కేంద్రం) సిబ్బంది ప్రేమ్, మదర్‌థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్‌చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవానికి దేవదాయశాఖ మంత్రికి ఆహ్వానం



బ్రహ్మంగారిమఠం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి మఠంలో ఆగస్టు 6వ తేదీ గోవిందమాంబ సమేత వీరబ్ర హ్మేంద్రస్వాముల మాస కల్యాణ మహో త్సవానికి సంబంధించి దేవదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు మఠం దేవస్థాన ఫిట్ పర్సన్ శంకర బాలాజీ తెలిపారు. కల్యాణ మహోత్సవానికి మంత్రిని హాజరు కావాలని ఆయన కోరారు. అనంతరం మంత్రి కల్యాణమహోత్సవ ఆహ్వానపత్రికను ప్రదర్శించారు.

రసవత్తరంగా మల్టీడే క్రికెట్ పోటీలు



కశ్యప్‌రెడ్డి, గైబు, దినేష్

కడప స్పోర్ట్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం కడప జట్టుపై నెల్లూరు జట్టు 11 పరుగుల ఆధిక్యత సాధించగా, మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు 56 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. వివరాలిలా.....

కేవోఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు, కడప జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో తొలిరోజు టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 29.3 ఓవర్లలో కేవలం 78 పరుగులకే కుప్పకూలింది. బౌలింగ్ విభాగంలో కడప జట్టు బౌలర్లు కశ్యప్ రెడ్డి, గైబు చెరీ 5 వికెట్లు పడగొట్టి స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 38.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌట్ అయింది. ఇందులో లోకేష్ 55 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 62 పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 3 వికెట్లు పడగొట్టి 73 పరుగులు చేసింది. దీంతో ఇప్పటివరకూ నెల్లూరు జట్టుకు 11 పరుగుల ఆధిక్యతలో నిలిచింది.

నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బ్యాటింగ్‌కు చేపట్టి.. తన మొదటి ఇన్నింగ్స్‌లో 38.2 ఓవర్లలో 128 పరుగులకే చేతులెత్తేసింది. బౌలింగ్ విభాగంలో చిత్తూరు బౌలర్ దినేష్ ఏకంగా 6 వికెట్లు పడగొట్టి స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 50.5 ఓవర్లలో 184 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో అక్తర్ 81 పరుగులు చేశారు. దీంతో చిత్తూరు జట్టుకు 56 పరుగుల ఆధిక్యత లభించింది.

రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు



కడప(వినాయకనగర్),జూలై21(ఆంధ్రజ్యోతి): నగరంలోని శివానందపురంలోని ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వీటిపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోలేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రిమ్స్‌కు వెళ్లే రహదారిలో 5 స్తంభాలు రోడ్డు మధ్యలో ఉన్నాయి. గతంలో రోడ్డు చిన్నదిగా ఉన్నప్పుడు రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు ఉండేవి. రోడ్డు విస్తరణలో భాగంగా డబుల్ రోడ్డు వేయడంతో విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యకు చేరాయి. ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా అశోక్‌నగర్, ఆర్టీసీ కాలనీ, రెడ్డీస్‌కాలనీ, చిన్నచౌకు వాసులందరూ రిమ్స్‌కు వెళ్లాలంటే ఈ రోడ్డు గుండానే వెళుతుంటారు. అంతేగాకుండా రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రావాలన్నా ఈ రోడ్డు గుండానే వస్తుంటారు. స్థానికులు ప్రయాణించాలన్నా ఇబ్బందికరంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ స్తంభాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రైస్తవ పాస్టర్లకు సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏపీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్

కడప నాగరాజుపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ పాస్టర్లకు సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయాలని ఏపీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లెం విజయభాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం చిన్నచౌక్ అశోక్‌నగర్ క్రైస్ట్ ప్రేయర్ చర్చిలో ఏపీపాస్టర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం క్రైస్తవ పాస్టర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎఫ్ జిల్లా కమిటీ గౌరవాధ్యక్షుడు బిషప్ శామ్యూల్‌బాబు, గౌరవసలహాదారుడు బిషప్ దేవన్న, ఉపాధ్యక్షుడు బోనం ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం

చక్రాయపేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలిశెట్టిపల్లె, సురభి, హరిజనవాడ, మహదేవపల్లె, బొజ్జవాండ్లపల్లె గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల ఇందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పులివెందుల కమిటీ అధ్యక్షుడు వరుణ్‌కుమార్ మాట్లాడుతూ త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో ప్రచారం నిర్వహించామన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ చిత్ర పటాన్ని ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగబాధలు ప్రజలకు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల కమిటీ ప్రతినిధులు మహేశ్వర్‌రెడ్డి, గురుమూర్తి, పోతులూరు, వెంకటయ్య, రామాంజి, కృష్ణవేణి పాల్గొన్నారు.

విద్యుత్ టవర్లతో టెన్షన్..!



రైతుల పొలాల్లో వెళుతున్న విద్యుత్ లైన్లు

సీకేదిన్నె, జూలై 21 (ఆంధ్రజ్యోతి):చింతకొమ్మదిన్నె మండలంలోని రైతులు విద్యుత్ టవర్ల టెన్షన్ వీడ లేదు. అనంతపురం నుంచి కడపకు 400 కేవీ హై టెన్షన్ ట్రాన్స్‌మిషన్ లైన్ల టవర్ల కారణంగా రైతులు పూర్తిగా నష్టపోయే ప్రమాదాలు అనేకం ఉన్నాయి. దానికితోడు అభివృద్ధికి అవరోధంగా విద్యుత్ టవర్ల ఏర్పాటు జరుగుతోందని రైతులతోపాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ కార్పొరేట్, పవర్‌గ్రిడ్ సంస్థవారు అవేమీ పట్టించుకోకుండా లోపభూయిష్టమైన డిజైన్లతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఎంతో విలువైన భూములు విద్యుత్ టవర్ల కారణంగా నష్టపోవడంతోపాటు గుడులు, బడులు సమీపంలో కూడా విద్యుత్తు టవర్లు నిర్మిస్తూ అటు పిల్లలకు, ఇటు భక్తులకు, రైతులకు అన్నివిధాలా నష్టపరుస్తూ తీసుకున్న ఇటువంటి చర్యలు మానుకోవాలని కోరుతున్నారు. పవర్‌గ్రిడ్‌వారు ఇప్పటికైనా వారి కార్పొరేట్‌కు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోకుండా రైతులకు మేలు జరిగే విధంగా ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించి జాతీయ రహదారి వెంబడి టవర్లు వేయకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఆదిశగా ఉన్నతాధికారులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

●చెరువులో టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్న రైతులు చింతకొమ్మదిన్నె చెరువులో అనుమతి లేకుండా హై పవర్ విద్యుత్తు లైను టవర్ నిర్మాణాన్ని రైతులు అడ్డుకున్నారు. కాగా ఇటీవల చింతకొమ్మదిన్నె చెరువులో నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే విద్యుత్తు లైన్లను నిర్మిస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న రైతులు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు అక్కడికివెళ్లి టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. భారీగా రైతులు రావడంతో కాంట్రాక్టర్లు తాత్కాలికంగా పనులను నిలిపివేశారు. ఇప్పటికైనా అధికారులు అనాలోచిత, లోపభూయిష్ట డిజైన్లు మార్చి రైతులకు ఇబ్బంది కలుగకుండా, అభివృద్ధికి ఆటంకం లేకుండా గుట్టలపై నుంచి లైను తీసుకెళ్లాలని కోరుతున్నారు. గతంలో రెవెన్యూ డివిజనల్ అధికారితోపాటు తహసీల్దార్లు ప్రత్యామ్నాయం చూపినప్పటికీ ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా తిరిగి పాత పద్ధతిలోనే నిర్మాణాలకు ముందుకు రావడం పట్ల రైతులు వ్యతిరేకిస్తున్నారు.

డిజైన్‌ను అమలు పరుస్తాం

ఢిల్లీ నుంచి మాకు ప్లాన్ డిజైన్ పంపిస్తారు. ఆ ప్లాన్‌ను అమలుపరుస్తాం. కాంట్రాక్టర్ డిజైన్ ప్రకారం పనిచేయించి రైతులకు పరిహారం అందే విధంగా చూస్తాం. రైతులు ఏమైనా అభ్యంతరాలు తెలిపితే వాటిని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

● శ్రీనాథ్, పవర్‌గ్రిడ్ చీఫ్ మేనేజర్

రైతులకు నిరంతరం సేవలు అందించాలి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

సీకేదిన్నె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు నిరంతరం సేవలు అందించి రైతుల మన్ననలు పొందాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక నాగిరెడ్డిపల్లె వ్యవసాయ సహకార సంఘం ప్రెసిడెంట్‌గా గంధం మోహన్‌బాబు, డైరెక్టర్లుగా బాలిరెడ్డి, గురుప్రసాద్ చేత డీసీవో వెంకటసుబ్బయ్య ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా లోన్లు ఇప్పించి సకాలంలో కట్టించే విధంగా చూడాలన్నారు. చింతకొమ్మదిన్నె మండలానికి తాగు, సాగు నీటికి అవసరమైన వెయ్యి కోట్ల నిధులను తెప్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల టీడీపీ ఇన్‌చార్జిలు, కమలాపురం మార్కెట్‌యార్డు డైరెక్టర్ రాఘవరెడ్డి, వల్లూరు సహకార సంఘం ప్రెసిడెంట్ నాగేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు అభిమానులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరిప్రసాద్, వేణుగోపాల్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, బీజేపీ చంద్రమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం సాధ్యం





సమస్యలు వింటున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, వృద్ధుడితో మాట్లాడుతున్న బీటెక్‌రవి

సీకేదిన్నె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యపడుతుందని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం పెద్దకాంపల్లె పంచాయతీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంధం మోహన్‌బాబు, కృష్ణారెడ్డి, అయ్యవారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల..: కూటమి ప్రభుత్వం అందించే పథకాలు అర్హులకు అందేలా చూస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్‌రవి) పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం యర్రగుడిపల్లెలో సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికీ టీడీపీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఆయన ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓ వృద్ధుడు కాలు లేకవీల్‌చైర్‌లో కూర్చోవడంతో ఆయన వద్దకు వెళ్లి బీటెక్ రవి పరామర్శించారు. పింఛన్ వస్తోందా అని ఆయన్ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వృద్ధాప్య పింఛన్ వస్తోందని ఆయన వివరించారు. రూ.6వేలపింఛన్ వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పలువురుపక్కా గృహాలు కావాలని, పింఛన్లు కావాలని ఆయన్ను అడిగారు. హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, తొండూరు మండల మాజీ ఉపాధ్యక్షుడు వైవీ మల్లికార్జునరెడ్డి, కాంబల్లె గంగాధర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాయకులు తదితరులుపాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందించండి



వినతిపత్రం అందిస్తున్న గాలిహరిప్రసాద్

వేంపల్లె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలో టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డిని కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. వేంపల్లెలో ఆరేళ్లగా ప్రారంభానికి నోచుకోని టీటీడీ కల్యాణమండపాన్ని తెరిపించాలని కోరారు. అలాగే వృషభాచలేశ్వరస్వామి దేవస్థానంలో నాయీబ్రాహ్మణులను నియమించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే గండి క్షేత్రానికి టీటీడీ నుంచి రావాల్సిన బంగారు, వెండితో పాటులడ్డూ ప్రసాదం తయారు చేసేందుకు పోటు నిర్మాణానికికావాల్సిన నిధులను టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నుంచి మంజూరు చేయించాలని కోరగా మంగళవారం జరిగే పాలక మండలిసమావేశంలో చర్చించి ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు హరిప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నేషనల్ కౌన్సిల్ సభ్యులు కె.రామచంద్రరెడ్డి, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప్పరపల్లెలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

చెన్నూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లెలో మంగళవారం సాయంత్రం 4గంటలకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు చెన్నూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డిహాజరవుతున్నారని, అలాగే ప్రజలు తమ సమస్యలు తెలుపుకుని వాటికి పరిష్కారం పొందాలన్నారు.

అధిక మోతాదులో యూరియా వాడితే అనర్థమే

వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు చంద్రానాయక్



చెన్నూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి సాగులో యూరియాను ఇష్టానుసారంగా వాడితే భూసారం దెబ్బతిని భవిష్యత్తులో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు చంద్రానాయక్ అన్నారు. చెన్నూరులో సోమ వారం యూరియా నిల్వలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 300 కిలోల యూరియాను మూడు దపాలుగా వాడాలన్నారు. అలాగే దుక్కిలో పొటాషియం తప్పక వాడాలని సూచించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాలి తప్ప ఇష్టానుసారంగా వాడడం వల్ల భూసారం దెబ్బతిని పంట దెబ్బతినే అవకాశం ఉందన్నారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, తగినన్ని నిల్వలున్నాయన్నారు. ప్రతి రైతుకూ యూరియా అందించడం జరుగుతుందన్నారు. అనంతరం రైతుకు యూరియా పంపిణీ చేయడంతో పాటు పలు సూచనలు, సలహాలు అందించి ఖరీఫ్‌లో మంచి దిగుబడి సాధించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళ అమ్మకాలు పొడిగింపు

కడప(వినాయకనగర్), జూలై21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన చేనేత హస్తకళ ప్రదర్శన అమ్మకాలు 20వ తేదీ వరకే జరిగినట్లు తెలిసిన విషయమే. అయితే రెండు రోజులు పొడగించి మంగళవారం సాయంత్రం వరకు అమ్మకాలు జరుగుతున్నట్లు చేనేత హస్తకళా ప్రదర్శన కార్యదర్శి పసుపులేటి వెంకయ్య తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



పులివెందుల రూరల్,జూలై 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను సచివాలయ శానిటరీ సెక్రటరీలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదేశానుసారం కూరగాయల మార్కెట్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో కాంగ్రెస్ నేతల ధర్నా



ఢిల్లీలో జరిగిన ధర్నాలో జిల్లా కాంగ్రెస్ నాయకులు

కడప కలెక్టరేట్, జూలై 21,(ఆంధ్రజ్యోతి): విభజన చట్టంలోని హామీలు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు సోమవారం ధర్నా చేశారు. ఈ ధర్నా సుంకర పద్మశ్రీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నేతలు ఎస్ఏ సత్తార్, జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీరాములు మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయడంలో ఎన్డీఏ ప్రభుత్వం విఫలమైందన్నారు. కడపలో సెయిల్ ఆధ్వర్యంలో కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలన్నారు. టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు బీజేపీ తొత్తులుగా మారి ప్రత్యే హోదా ధ్యాసే లేకుండా పోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ప్రాణానికి రక్ష



మాట్లాడుతున్న సీఐ చాంద్‌బాష

పులివెందుల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాణరక్షగా నిలుస్తుందని అర్బన్ సీఐ చాంద్‌బాష పేర్కొన్నారు. సోమవారం పులివెందుల పట్టణ శివార్లలో సీఐ తన సిబ్బందితో హెల్మెట్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. టూవీలర్లపై వచ్చే వారి రికార్డులను పరిశీలించి, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. హెల్మెట్ లేకుండా టూవీలర్లు నడిపే వారికి హెల్మెట్ వాడితే ప్రమాదాల నుంచి ఎలా బయటపడతారో, హెల్మెట్ లేకుంటే ఎలా ప్రమాదాలు జరుగుతాయనే విషయాలను వివరించారు. ఒకసారి హెల్మెట్ లేకుండా పట్టుబడిన వారు మరోసారి హెల్మెట్ లేకుండా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని అందరుగుర్తించుకొని హెల్మెట్ ధరించాలన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలి



ఎస్పీకి ఫిర్యాదుచేస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్,జూలై 21 (ఆంధ్ర జ్యోతి): జర్నలిస్టుల పై కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ సమాజంలో అగౌరవ పరుస్తూ నిరాధారమైన ప్రచారం చేయడంపై ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్రపూర్వ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై ఎస్పీ అశోక్‌కుమార్ స్పందిస్తూ కేసు నమోదు చేసి వారంలోగా దర్యాప్తు పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, నాగరాజు, ఉపాధ్యక్షుడు సర్దార్, స్వతంత్ర బ్యూరో సుబ్బారెడ్డి, కెమెరామెన్లు శ్యామ్, వీరాంజనేయులు, ఐన్యూస్ చానల్ రిపోర్టర్లు భువనేశ్వర్‌రెడ్డి, పూల వెంకటసుబ్బయ్య, చెన్నయ్య, నరసింహులు, టీవీ5 సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

వీరపునాయునిపల్లె, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాలపల్లె గ్రామ క్రాస్ రోడ్డు వద్ద 15లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా సంగాలపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఇరువురు వ్యక్తులు నాటుసారా కలిగి ఉండడంతో వారిని అరెస్టు చేసి నాటుసారాను సీజ్ చేసి, మోటార్ బైకును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బీఎడ్, లా కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప నాగరాజుపేట,జూలై 21 (ఆంధ్ర జ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఎడ్., లా కళాశాలలో భవ నాలు, అధ్యాపకులు లేకున్న వాటిపై రెండు రోజుల్లోగా కమిటీ వేసిచర్యలు తీసుకోకపోతే చలో యోగివేమన యూని వర్సిటీకి పిలుపునిస్తామని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్ అన్నారు. సోమారం వైవీయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ పద్మ, సీడీసీ డీన్ రఘుబాబును కలిసి వినతిపత్రం అందించారు.

కన్వర్షన్ లేకుండానే భూ విక్రయాలు

● రియల్ ఎస్టేట్‌గా మారుతున్న వ్యవసాయ భూములు ● రెవెన్యూ ఆదాయానికి భారీగా గండి ● పట్టించుకోని అధికారులు

పోరుమామిళ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మండలంలో ఎటువంటి కన్వర్షన్ లేకుండానే వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్‌గా మారుతున్నాయి. అంతేకాక చాలామంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు డీకేటి భూములను కూడా రియల్ ఎస్టేట్‌గా మార్చుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు రాజకీయ కారణాలు ఏమో తెలియదు కానీ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి అనుమతులు పొందాల్సి ఉన్నా అధికారులు అప్పుడప్పుడూ తనిఖీలు చేసి నోటీసులు ఇచ్చి పెనాల్టీ కడుతున్నారే తప్ప పూర్తిస్థాయిలో మండలంలో ఎన్ని లేఅవుట్లను వేశారు, లేఅవుట్లకు సంబంధించి రియల్ ఎస్టేట్ భూములు ఎంత విస్తీర్ణంలో వేశారు. డీకేటి భూములు కూడా రియల్ ఎస్టేట్‌గా మలుచుకుంటున్నారా? అనే వివరాలపై విచారణ చేయడంలేదు. ముఖ్యంగా పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీలకు సంబంధించి వందల ఎకరాలు ప్రస్తుతం వ్యాపారాలు ఉన్నా లేకున్నా దాదాపు పదేళ్ల నుంచి వ్యవసాయభూములను రియల్ ఎస్టేట్ భూములుగా మలిచారు. ఆదిఆంధ్రపాలెం సమీపంలో తిప్పల వద్దకు కూడా వెంచర్లు వేశారు. అయితే వాటికి అనుమతులు ఉన్నాయా లేవా అని ప్రశ్నించే నాథుడు లేడు. ఎవరైనా పంచాయతీలో కానీ, గ్రామాల్లో కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు పంచాయతీ అనుమతులు సంబంధిత అధికారులతో అనుమతులు తీసుకోవాలి. కానీ ఈ కన్వర్షన్ లేకుం డానే అమ్మకాలు జరుపుతున్నారు. దీని వల్ల ప్లాట్లను కొనుగోలు చేసిన వారు తిరిగి గృహాలు నిర్మించుకోవాలంటే కన్వర్షన్‌కు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. దీని వల్ల రెవెన్యూ, పంచాయతీల ఆదాయానికి గండి పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడితే ప్రభుత్వానికి ఆదాయం పెరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా అనధికారిక వెంచర్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పోరుమామిళ్లలో వెంచర్లు

50 మందికి నోటీసులిచ్చాం

పోరుమామిళ్ల మండలంలో అనుమతులు లేకుండా వేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు 50 మందికి నోటీసులిచ్చాం. వారి నుంచి స్పందనలేకపోవడంతో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్‌కు రిపోర్టు చేశాం.
-చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, పోరుమామిళ్ల

పారిశుధ్య నివారణ చర్యలు



మురుగునీటిని పరిశీలిస్తున్న అధికారులు, మాజీ ఎమ్మెల్సీ పుల్లయ్య

ప్రొద్దుటూరు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని గోపవరం పంచాయతీవిరాట్‌నగర్‌లో మెరుగైన పారిశుధ్యంకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. సోమవారం ఆ ప్రాంతంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు సందర్శించారు. వర్షాలధాటికి గోపవరం పంచాయతీలో రోడ్లపై నిలబడిపోతున్న మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు కమిషనర్‌తో చర్చించి డ్రైనేజీ కాలువల కోసం చర్యలు చేపట్టారు.

ఘనంగా నగర సంకీర్తన

ప్రొద్దుటూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏకాదశి పర్వదినం సందర్భంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. సోమవారం ఇస్కాన్ వ్యవస్థాపకుడు భక్తివేదాంతం స్వామి ప్రభుపాద, శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలను పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. వృషభరాజములు రథాన్ని లాగడం ఆకర్షణగా నిలిచింది. ఇస్కాన్ కేంద్రం నుంచి నగర సంకీర్తనలో భజనలు చేశారు.

పోరుమామిళ్లలో ఘనంగా ఉరుసు

పోరుమామిళ్ల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక హుసేన్‌పీర్ దర్గాలో ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. రాత్రి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఖవ్వాలి పోటీలు కూడా నిర్వహించారు. గంజెసాహిద్ దర్గాలో సోమవారం గంధం మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

జిల్లేళ్లలో వర్షపునీరు నిలువకుండా చర్యలు

దువ్వూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం జిల్లేళ్ల గ్రామంలో నీరు నిలువకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకున్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వర్షం వస్తే చాలు ఆ రోడ్లు చెరువులే' అనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. సదరు కథనంకు స్పందించిన ఎంపీడీవో రామకృష్ణయ్య వెంటనే కార్యదర్శిని పనులు చేయించేందుకు పురమాయించారు. సదరు పనులు చేయించడంతో సమస్య పరిష్కారం అయింది. సాయంత్రం ఎంపీడీవో అక్కడికి వెళ్లి వాటిని పరిశీలించారు.



నీరు నిలువకుండా చేయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

తొడగొట్టి సవాల్ విసిరిన సర్పంచ్ తండ్రి

ఎవరో చెప్పినమాటలు విని పంచాయతీలో వర్షపునీరు నిలిచిందని పత్రికలో రాస్తావా అంటూ సర్పంచ్ మౌలాబీ తండ్రి మౌలాలి 'ఆంధ్రజ్యోతి' స్థానిక విలేకరిపై బెదిరింపులకు పాల్పడ్డాడు. నీ అంతు చూస్తానని ఎంపీడీవో కార్యాలయం ఆరుబయట మూడుసార్లు తొడగొట్టి విలేకరిపై ఆగ్రహం వెలిబుచ్చారు. ప్రజల పక్షాన నిలిచి పత్రికలో సమస్యలపై రాశామని, ఇంకా సమస్యలు మా దృష్టికి వస్తే మళ్లీ రాస్తానని 'ఆంధ్రజ్యోతి' కంట్రిబ్యూటర్ సమాధానం ఇవ్వడం జరిగింది. అక్కడున్న కొందరు అధికారులు జోక్యం చేసుకుని సర్దిచెప్పగా సర్పంచ్ తండ్రి మౌలాలి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

వర్షానికి నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కాశినాయన జూలై21(ఆంధ్రజ్యోతి) కాశినాయన మండలంలో కురిసిన భారీ వర్షానికి ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగి కిందపడిపోయింది. దీంతో దాని పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగా మండలంలో ఆదివారం రాత్రి 55 మి.మీ వర్షం కురిసినట్లు ఏఎస్‌వో అశోక్ తెలిపారు. వర్షం మూలంగా పిట్టిగుంట సమీపంలోని రెగడి వ్యవసాయ పొలాలల్లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి. గుర్విరెడ్డికి చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయింది. దీంతో 11కేవీకి సర్వీసు లైన్‌కు చెందిన అల్యూమినియం వైర్లు తెగిపడిపోయాయి. దీంతో తీవ్ర నష్టం కల్గిందని రైతు తెలిపారు.



రక్తదానం చేయండి... ప్రాణాలను నిలపండి

మైదుకూరు రూరల్, జులై 21(ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయండి.. ఓ నిండు ప్రాణాలు కాపాడండి అని బద్వేల్ ఆర్‌డీఓ చంద్రమోహన్ పిలుపునిచ్చారు. స్థానిక స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కొందరు దాతలు రక్తం దానం చేశారు. రక్తం దానం చేసిన వారికి అధికారులు సర్టిఫికేట్లు అందచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజసింహ్మా నరేంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు,వార్డు కౌన్సిలర్ కుర్రా రాధ,పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కల్లూరు జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి 333 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్నవారిని గుర్తించారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు శాతం, పట్టణ ప్రాంతాల్లో ఎనిమిది శాతం పాఠశాల విద్యార్థులలో దృష్టిలోపం ఉందని నివారించడానికి విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.

విద్యాదాత సానపురెడ్డి గోపాల్‌రెడ్డి



సానపురెడ్డి గోపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాజగోపాలరెడ్డి తదితరులు

బద్వేలు రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : విద్యాదాత సానపురెడ్డి గోపాల్‌రెడ్డి సేవలు మరువలేనవని మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాలరెడ్డి అన్నారు. స్వర్గీయ సానపురెడ్డి గోపాల్‌రెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ గోపాల్‌రెడ్డి దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి పలువురు ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా ఎంతో మందికి విద్యాబోధన చేసి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడమే కాకుండా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న గోపాల్‌రెడ్డిని బద్వేలు ప్రాంత ప్రజలు మరువలేరన్నారు. కార్యక్రమంలో ఆయన కుమారుడు సానపురెడ్డి రామగోపాల్‌రెడ్డి, పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి, ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షులు నరసింహారెడ్డి, పలువురు పెన్షనర్స్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఏటూరు కాలువకు నీరు విడుదల

చాపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేసీకెనాల్ అనుబంధమైన ఏటూరు కాలువకు సోమవారం కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు సత్యవేమారెడ్డి, కేసీకెనాల్ డీఈ చిన్నపుల్లయ్య, ఏఈ గురుమోహన్‌రెడ్డి తాగునీటిని విడుదల చేశారు. స్లూయిస్‌కు పూజలు చేసి నీటిని కాలువలోకి వదిలారు. ఈ కాలువకు ప్రతిరోజు 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు. కొద్దిరోజుల తర్వాత క్రమేణా 60 క్యూసెక్కుల వరకు తాగునీటిని విడుదల చేస్తామన్నారు. విశ్వనాథపురం, అల్లాడుపల్లె, చిన్నగురవలూరు, గాంధీనగర్, మిడుతూరు మరికొన్ని గ్రామాల్లో తొమ్మిది వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతుందన్నారు. రైతులు వరి నారుకయ్యలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, మేకల బాబు, నారాయణ, వీరశేఖర్‌రెడ్డి, నారపురెడ్డి, బీజేపీ మండల శాఖ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న గురివిరెడ్డి, అధికారులు

దళితుల ఇంటిస్థలాలకు హద్దులు చూపించాలి

బి.కోడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మున్నెల్లి గ్రామానికి చెందిన దళితులకు గతంలో ఇంటి పట్టాలు ఇచ్చారని వారికి ఇచ్చిన స్థలాలకు హద్దులు చూపించాలని సీపీఐ నేతలు కోరారు. ఆమేరకు సోమవారం సీపీఐ మండల కార్యదర్శి ప్రసాద రావు, చెన్నయ్య తహసీల్దారు దస్తగిరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మున్నెల్లి దళితులకు ఇంటిస్థలాలు ఇచ్చారని, ఇంత వరకు అవి ఎక్కడున్నాయో వాటిని రెవెన్యూ అధికారుల చూపించి వాటికి హద్దులు ఏర్పాటు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దారు స్పందిస్తూ పట్టాలు పరిశీలించి వాటిని సర్వే చేయించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని తెలిపినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మున్నెల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

24న చౌడేశ్వరీదేవి జన్మదిన వేడుకలు

జమ్మలమడుగు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీదేవిజన్మదిన వేడుకలను ఈనెల 24వ తేదీ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు గంజికుంట తిరుమలదాసు, కమిటీవారు తెలిపారు. అమ్మవారికి తెల్లవారుజామున విశేష ద్రవ్య పంచామృతములతో అభిషేకం, విశేష అర్చన, ఆలయ ప్రాంగణంలో నాదబృందం వారిచే బిందెసేవ పెద్ద ఎత్తున గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఊంజల్‌సేవ, కలాభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 3 గంటల నుంచి సామూహిక కుంకుమార్చన, లక్ష దీపాలంకరణ , మహామంగళహారతి ప్రసాద వినిమయం ఉంటుందన్నారు.

వేతనాల పెంపు జీవో తాత్కాలిక ఉపశమనమే

ప్రొద్దుటూరు టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జారీ చేసిన జీవోనెం.124 తాత్కాలిక ఉపశమనే అని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ.3 వేలు వేతనాలు మాత్రమే పెంచుతూ జీవో నెం.124 జారీ చేయడం శోచనీయమన్నారు. ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లపై భవిష్యత్తులో తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి చైతన్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి మధు, రాజేష్, లక్ష్మీదేవి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

సెకీ ఒప్పందం రద్దుచేయాలి

బద్వేలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆదాని కంపెనీతో కూటమి ప్రభుత్వం సెకీ ఒప్పందం రద్దుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎన్‌జీవో హోంలో స్మార్ట్‌మీటర్లు ఆదానీకి వరం- రాష్ట్ర ప్రజలకు శాపం అనే అంశంపై ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదాని కంపెనీతో సెకీవిద్యుత్ ఒప్పందాలు 25 సంవత్సరాలకు కుదుర్చుకుని 7 రూపాయలకు యూనిట్ విద్యుత్ పెంచుకుని ప్రజలపై లక్షా యాభై వేల కోట్లు భారాలు వేసి నిలువు దోపిడి చేయాలని ఆదానికి లైసెన్స్ ఇచ్చారని ఇది సరికాదన్నారు.కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీను, జిల్ల కార్యదర్శి వర్గ సభ్యులు శివకుమార్, జిల్లా కమిటి సభ్యులు చాన్‌బాష, పట్టణ కమిటి సభ్యులు మోక్షమ్మ, బాబు, చిన్ని, షరీఫ్ పాల్గొన్నారు.

గడువులోగా రీసర్వే పూర్తి చేయాలి : ఆర్డీవో

జమ్మలమడుగు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో రీ సర్వే ఇచ్చిన గడువు లోపు పూర్తిచేయాలని ఆర్డీవో సాయిశ్రీ సర్వేయర్లకు సూచించారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో డివిజన్ పరిధిలోని సర్వేయర్లకు రీ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ రీ సర్వే విమర్శలకు తావివ్వరాదని ఇప్పటి వరకు రీ సర్వేపై మిగిలి ఉన్న గ్రామాల్లో నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. రీ సర్వే నవంబరు నాటికి గ్రామాల్లో బౌండ్రీలు ఏర్పాటు చేయడంతోపాటు. డిసెంబరు 1 నాటికి పట్టా భూములకు సంబంధించి రీసర్వే ప్రారంభించాలన్నారు. ఫీల్డ్‌లో ఎక్కడ సమస్యలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సెప్టెంబరు 15 నాటికి రీ సర్వేకుసంబంధించిన ఫీల్డ్ రికార్డులు వీఆర్వోలు పూర్తి చేయాలన్నారు. ఒక రైతుకు ఎకరా భూమి ఉండి అలాంటివారికి ఆన్‌లైన్‌లో ఎక్కువ చూపిస్తున్నట్లు ఉంటే సమగ్ర వివరాలు తీసుకుని సరిచేయాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్లు హరి, ఏవో ఇక్బాల్‌బాష, డివిజన్ పరిధిలోని సర్వేయర్లు పాల్గొన్నారు.



రీ సర్వేపై సమీక్షా సమావేశంలో ఆర్డీవో సాయిశ్రీ, అధికారులు

కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన

అట్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే ఇంటింటికి సుపరిపాలన సాధ్యమని డీసీసీ బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోనరాజుపల్లె ఎస్సీ కాలనీలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ సుపరిపాలనపై ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకుని వెంటనే అధికారులకు ఫోను ద్వారా తెలిపి పరిష్కరించారు. అలాగే పింఛన్లు, ఉచిత గ్యాస్, తల్లికి వందనం పథకాలుపై లబ్ధి పొందిన మహిళలు కూటమి ప్రభుత్వం పాలనలపై ప్రశంసలు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి, చంద్రారెడ్డి, నవీన్‌రెడ్డి, రాధాక్రిష్టారెడ్డి, పరంధామరెడ్డి, చెంచురెడ్డి, గిరిరాజు, సుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సుపరిపాలనలో డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి, టీడీపీ నేతలు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పెద్దముడియం/జమ్మలమడుగు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు చేపడుతూ అభివృద్ధి సాధించడమే ప్రస్తుత ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న భూపేష్‌రెడ్డికి గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మొదటగా శ్రీక్రిష్ణ దేవాలయంలో పూజలు నిర్వహించి గ్రామంలో ఇళ్లిళ్లూ తిరుగుతూ ప్రభుత్వమందిస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు కొండారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి, నాగరాజు, ఈశ్వర్‌రెడ్డి, నారపురెడ్డి, సోమిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా అని అడిగారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలాగా ముఖ్యమంత్రి పరిపాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణారెడ్డి, దలాల్, షామీర్, షబ్బీర్, దాదాపీర్, వెంకటేష్, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

నిరుపేదల అభివృద్ధే సీఎం లక్ష్యం

బ్రహ్మంగారిమఠం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని నిరుపేదల అభివృద్ధే సీఎం నారాచంద్రబాబునాయుడు లక్ష్యమని మండల టీడీపీ యువ నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ మాలేపాటి సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రేకలకుంట పంచాయతీ లక్ష్మిబాలాజీ నగర్‌లో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్‌లు అమరావతి వెంకటసుబ్బయ్య, వీరయ్య, జయన్న, పెంచలయ్య, క్రిష్ణయ్య, పెద్దవీరయ్య, రామాంజనేయులు, శివయాదవ్, బ్రహ్మానాయుడు, వెంకటేశ్, రాజారత్నం, నరసయ్య, డెన్ని, మల్లేశ్ పాల్గొన్నారు.

బద్వేలులో: ప్రజా సంక్షేమ పాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతోందని స్థానిక టీడీపీ నాయకుడు జె. సింగరయ్య ,తెలుగు రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఝాన్సీలు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 5వ వార్డులో సుపరి పాలన- తొలి అడుగు కార్యక్రమంలో వారు 155, 156 బూత్‌లలో డోర్‌టుడోర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సింగసాని రమణయ్య, తెలుగుయువత నాయకులు గనమంతు రాజేష్, కొంకుల రవి, ప్రశాంత్ , చిన్నా, వెంకటసుబ్బయ్య, సురేష్‌బాబు పాల్గొన్నారు.



ప్రజలకు పథకాల గురించి తెలుపుతున్న మల్లిఖార్జునరెడ్డి, సుబ్బారావు

సింగిల్‌విండో పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

అట్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అట్లూరు సింగిల్‌విండో అధ్యక్షుడుగా మంచూరి సూర్యనారాయణరెడ్డి, డైరెక్టర్లుగా బోవెళ్ల నందగోపాల్‌రెడ్డి, పాటూరి రాధాక్రిష్టారెడ్డి సోమవారం అట్లూరు పరపతి సంఘంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ కొత్త రుణా లు కూడా విరివిగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రైతులకు అందుబాటు లో ఉండేలా ఎరువుల అంగడి త్వరలో ఏర్పాటు చేస్తామని డీసీసీ బ్యాంకు చైర్మన్ హోదాలో మంచూరి వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డిస్ట్రిక్ జనరల్ మేనేజరు రాజామణి, సొసైటీ సీఈవో గురయ్య, సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి, అరవ పెద్ద రామ సుబ్బారెడ్డి, పొత్తపి మునిరెడ్డి, పుల్లారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎల్.రామక్రిష్ణరెడ్డి, రామ్మూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఇబ్బందికర యాప్‌లను తొలగించాలి

బద్వేలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల యాప్‌లు ప్రవేశపెడుతూ అంగన్వాడీలను తీవ్ర మనస్థాపానికి గురిచేస్తున్నారని తక్షణమే వాటిని ఉపసంహరించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బద్వేలు సీడీపీవో శ్రీదేవికి వారొక వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వాలు గంటకో యాప్‌ను ప్రవేశపెట్టి అంగన్వాడీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకుడు నాగేంద్రబాబు, కో కన్వీనర్ కొండయ్య, యూనియన్ ప్రాజెక్టు గౌరవాధ్యక్షులు రాలు జయప్రద, లక్ష్మినరసమ్మ, సుబాషిణి, సుజాత, అమ్మణ్ణి తదితరులు పాల్గొన్నారు.



సీడీపీవోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీలు

సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలి

కొండాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథ కాలు అందరికి చేరువయ్యేలా చూడాలని ఎంపీడీవో నాగప్రసాద్ అధికారులను కోరారు. ఎంపీపీ లక్ష్మి దేవి అధ్యక్షతన స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరి గింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మం డలానికి కొత్తగా 80 వితంతు పింఛన్లు మంజూర య్యాయన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి చొరవతో రూ.7.19 కోట్లతో చిత్రావతి నది నుంచి నాలుగు పంచాయతీలకు మంచి నీరందించే పనులు జరుగుతున్నాయని ఎంపీడీవో తెలిపారు. వ్యవసాయాధికారి ఏపీ రామాంజులరెడ్డి మాట్లాడుతూ మండలానికి 100 మెట్రిక్‌టన్నులు జిప్సం, బోరాన్, జింక్‌సల్ఫేట్ మంజూరయ్యాయని వాటిని త్వరలోనే రైతులకు పంపిణీచేస్తామన్నారు. తమ పంచాయతీకి రెండు బోర్లు కావాలని దొబ్బుడుపల్లె సర్పంచ్ కోరారు.